రెండు నవలలు రాశా!

● ప్రఖ్యాత రచయిత, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్

'ఆయనకు 82 ఏళ్లు. లాక్‌డౌన్‌ను పుస్తక పఠనానికి, రచనా వ్యాసంగానికి అనువుగా మలుచుకున్నారు. రెండు నవలలూ రాశారు. బోలెడు పుస్తకాలూ చదివారు. మరో కొత్త రచన కోసం రంగం సిద్ధం చేస్తున్నారు. అందుకు సమకాలీన సమస్యలపై అధ్యయనం చేస్తున్నారు. ఆయనే ఎస్వీ యూనివర్సిటీ మాజీ ఉపాధ్యక్షుడు, తెలుగు సాహితీ దిగ్గజం, ప్రతిష్ఠాత్మక మూర్తిదేవి పురస్కార గ్రహీత, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్. సాహిత్య రంగంలో ఆయన స్పృశించని ప్రక్రియ లేదంటే అతిశయోక్తి కాదు. కరోనా సెలవులతో ఇనాక్ దైనందిన జీవితంలో వచ్చిన మార్పులను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

అనుభవం

వర్క్‌ఫ్రమ్ హోం వల్ల..

వర్క్‌ఫ్రమ్ హోం వల్ల నా కొడుకు, కోడలు ఇంట్లోనే ఉంటున్నారు. వాళ్లతో ఎక్కువ సమయం గడిపే అవకాశాన్ని కరోనా అందించింది(నవ్వుతూ...). ముంబయ్ ఐఐటీలో చదివే నా మనవడు సుధీరథ్, మెడిసిన్ చదువుతోన్న నా మనవరాలు సుకీర్తితో కబుర్లాడుతూ కాసేపు కాలక్షేపం చేస్తుంటా.

చదివిన పుస్తకాలు..

ఇప్పుడు రోజూ నేను రాసుకునే సమయం.. ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు. మళ్లీ మధ్యాహ్నం 3.30గంటల నుంచి సాయంత్రం ఆరు వరకు. ఇక రాత్రిళ్లు చదువుతా. గుర్రం జాషువా సంకలనం ఇష్టంగా చదువుతుంటా. అంబేడ్కర్ రచనలు చూస్తుంటా. లాక్‌డౌన్‌లో చదివిన పుస్తకాలంటే 'గ్రేట్ స్టోరీస్ బై నోబెల్ ప్రైజ్ విన్నర్స్', ప్లేటో 'రిపబ్లిక్' (ఆదర్శరాజ్యం), చార్లెస్ డార్విన్ 'ఆన్ ది ఆరిజన్ ఆఫ్ స్పీషియస్'. ఇవిగాక సాల్మన్ రష్డి 'మిడ్ నైట్స్ చిల్డ్రన్' చదువుతుంటే ఉత్సాహంగా అనిపించింది. 'సెలెక్టెడ్ స్టోరీస్ ఆఫ్ రష్యన్ రైటర్స్'లో లియో టాల్‌స్టాయ్, దాస్తొయెవ్‌స్కీ, చెహోవ్, పుష్కిన్, మాక్సింగోర్కి రచనలు చదువుతుంటే.. ఆ రచయితలకు మనిషి పట్ల ఎంత ఆర్తి ఉందో అర్థమవుతోంది. రుడ్యార్డ్ కిప్లింగ్, వీఎస్ నైపాల్, రస్కిన్‌బాండ్ రచనలంటే కూడా నాకు అమితమైన ఇష్టం. రెండు సంస్కృతుల మధ్య నలిగే మనిషి ఎట్లా ఉంటాడో వాళ్ల రచనల ద్వారా తెలిసింది. పోతులూరి వీరబ్రహ్మం 'కాళికాంబ శతకం' చదివాను. ఆయన మనిషిని ఎంత గొప్పగా ప్రేమించారో ఆ కవిత్వం ద్వారా అర్థమవుతోంది. ఆ రచన చదివాక సమాజాన్ని అంత ఉన్నతంగా ప్రేమించారు కనుకే మనుషుల మదిలో పోతులూరి మహిమాన్వితుడిగా నిలిచారని నాకు అనిపించింది.

భార్య జ్ఞాపకాలతో...

నేనొక రూపం దిద్దుకోడానికి మా అమ్మ కారణమైతే, ఆ రూపం నిలుపుకోవడానికి గొప్ప శక్తి నా భార్య భాగీరథి. ఆమె దూరమై పదమూడేళ్లు. ఇప్పుడు నా భార్య జ్ఞాపకమొస్తే కుమిలిపోను కానీ సన్నటి దుఃఖపు జీర ఒకటి రెండు, మూడు నిమిషాలు కళ్లలో నిలుస్తుంది. తర్వాత మా అమ్మ కూడా గుర్తొస్తుంది.

నా కోసం ప్రత్యేకమైన డైట్..

లాక్‌డౌన్‌లో బయటకెళ్లొద్దని నా కొడుకు శ్రీకిరణ్, కోడలు అనిత స్ట్రిక్ట్‌గా చెప్పారు. దాంతో మా ఇంటి వరండాలోనే ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట నిత్యం నడుస్తున్నా. రోజుకు మూడుసార్లు స్నానం చేస్తున్నా. నా కోడలు రూపొందించిన డైట్ చార్టు ఫాలో అవుతున్నా. రోజూ ఉదయం కషాయం ఇస్తున్నారు. బ్రేక్‌ఫాస్టులో ఇడ్లీ, దోసె, వడ, పొంగల్‌లో ఏదో ఒకటి తింటా. ఒక గ్లాసు రాగిజావ తాగుతా. తర్వాత ఏదైనా ఒక పండు తింటా. నాన్‌వెజ్ కన్నా, ఆకుకూరలు, కాయగూరల్ని ఇష్టంగా తింటా. బ్రాందీ, విస్కీనే కాదు.. టీ, కాఫీ కూడా అలవాటు లేదు(నవ్వుతూ...). రోజుకొక కోడిగుడ్డు కంపల్సరీ. మధ్యాహ్నం, రాత్రి భోజనంలో అన్నం తక్కువ, కూరలెక్కువ తినడం మొదటి నుంచి అలవాటు. డైనింగ్ టేబుల్‌పై పెరుగు ఉండాల్సిందే. రెండు పూటలా భోజనం చేశాక, కచ్చితంగా ఏదో ఒక సీజనల్ పండు తీసుకుంటా. ఉదయం 11.30కు కొబ్బరినీళ్లు లేదా ఫ్రూట్ జ్యూస్ ఇస్తారు. సాయంత్రం నాలుగింటికి బిస్కెట్స్ లేదా ఫ్రూట్స్ తింటా. ఇప్పుడు మామిడిపళ్లు బాగా తింటున్నా. తక్కువ మోతాదులో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడమే నా ఆరోగ్యరహస్యం. కాస్త బీపీ తప్ప మిగతా ఆరోగ్య సమస్యలేమీ లేవు. ఏమి తిన్నా అరిగించుకొనే శక్తి ఉంది. నిద్ర కూడా పిలిస్తే వచ్చేస్తుంది. రోజూ మధ్యాహ్నం రెండు గంటలు నిద్రపోతా. రాత్రి పదింటికి నిద్రపోతే ఉదయం 6కు లేస్తా.

హైదరాబాద్ సిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కరోనా నేపథ్యంలో వలస బతుకులపై ఒక నవల రాయాలనే ఆలోచన కలిగింది. అందుకు ప్రస్తుతం ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నా. అదిగాక ఈ మూడు నెలల్లో రెండు నవలలు రాశాను. అందులో అస్తిత్వంలోని ఔన్నత్యాన్ని వెతికే ఒక వ్యక్తి ప్రయత్నం ఇతివృత్తంగా ఒక నవల సాగుతుంది. మరొక నవలలో తల్లి జాడ కోసం పరితపించే ఒక బిడ్డ ఆరాటాన్ని అక్షరీకరించా. నా రచనలన్నీ మనిషి వేదన కేంద్రంగా సాగుతాయి.

సూపర్ వీక్

శిల్పారామాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతాం

● మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మాదాపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): శిల్పారామాన్ని మరింత ఆకర్షణీయంగా గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా ఆధునికీకరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పర్యాటక, ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పర్యాటకశాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రూ.97లక్షల పంట రుణాల చెక్కుల అందజేత

దుండిగల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భౌరంపేట్‌లోని ప్రాథమిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో 227మంది సభ్యులకు రూ.97లక్షల పంట రుణాల చెక్కులను ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మీదుల బాల్‌రెడ్డి, ఎస్‌వీ కృష్ణారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ పోలీస్ గోవిందర్‌రెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీ కమిషన్ పాలక మండలిని ఏర్పాటు చేయాలి

- ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి

బర్కత్‌పుర, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ కమిషన్‌కు తక్షణమే పాలకమండలిని ఏర్పాటు చేయాలని ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు కాచిగూడలోని ఓబీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె తెలిపారు.

'సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించాలి'

ఎల్‌బీనగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): లింగోజిగూడ బృందావన్‌కాలనీలో ఉన్న సరూర్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సరూర్‌నగర్ మండల కార్యాలయ కాంప్లెక్స్‌లోకి తరలించాలని కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌రావు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డిని కోరారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచనల మేరకు డివిజన్‌లోని పలు కాలనీ అసోసియేషన్ సభ్యులతోపాటు సరూర్‌నగర్ టీఆర్ఎస్ అధ్యక్షుడు ఆకుల అరవింద్, నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి బేర బాలకిషన్‌తో కలిసి బుధవారం మంత్రిని ఆమె చాంబర్‌లో కలిశారు.

బీజేపీ డివిజన్ అధ్యక్షుల నియామకం

బర్కత్‌పుర/రాంనగర్/ముషీరాబాద్/సరూర్‌నగర్/చిలకలగూడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 29డివిజన్లకు నూతన అధ్యక్షులను బీజేపీ నగర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు బుధవారం ప్రకటించారు. అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడిగా దాసోజు నాగభూషణం, బాగ్‌అంబర్‌పేట-చుక్కా జగన్, అడిక్‌మెట్-బి.జగదీష్‌కుమార్‌గుప్తా, భోలక్‌పూర్-రేగుల రవికుమార్, ముషీరాబాద్-జి.బద్రీనారాయణ, కవాడిగూడ-ఎంసీ మహేందర్‌బాబు, అడ్డగుట్ట-మహేష్, మెట్టుగూడ-భాస్కర్ ముదిరాజ్, సీతాఫల్‌మండి-ఎ.రాజేశ్వర్‌రావు, తార్నాక- రామువర్మ, సనత్‌నగర్-కన్నూరి క్రాంతికుమార్, రాంగోపాల్‌పేట-ఆకుల ప్రతాప్, ఎర్రగడ్డ-శ్రీధర్‌రెడ్డి, షేక్‌పేట-జి.శివకుమార్, యూసుఫ్‌గూడ-కె.చంద్రమోహన్, బోరబండ-జె.ఎస్.కృష్ణమోహన్, రహ్మత్‌నగర్-తంగెళ్లపల్లి లక్ష్మణ్, వెంగళరావునగర్-గణేష్‌ప్రసాద్‌సింగ్, అహ్మద్‌నగర్-రాకేష్, రెడ్‌హిల్స్- కె.క్రాంతికుమార్, విజయనగర్‌కాలనీ-డి.ఆనంద్‌కుమార్, గోల్కొండ-ఆమంచి శ్రీకాంత్, గుడిమల్కాపూర్- జి.సునీల్‌యాదవ్, జియాగూడ-జెట్‌పల్లి లక్ష్మీనారాయణ, కార్వాన్-దోర్తుల శ్రీనివాస్, నానల్‌నగర్-గోగికార్ బాలాజీ, టోలిచౌకీ-బొమ్మల శ్రీకాంత్‌చారి, పురానాపూల్-రాకూర్ బల్వీర్‌సింగ్, ఐఎస్ సదన్-తోట అమర్‌నాథ్‌రెడ్డి నియమితులయ్యారని రాంచందర్‌రావు తెలిపారు. బడంగ్‌పేట బీజేవైఎం పట్టణ అధ్యక్షుడిగా రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

'55 ఏళ్ల వయస్సు పైబడిన ఉద్యోగులు, కార్మికులకు విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి'

చాదర్‌ఘాట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ రోజురోజుకూ విజృంభిస్తోన్న నేపథ్యంలో టీఎస్ఆర్టీసీలో 55ఏళ్ల వయస్సు పైబడిన ఉద్యోగులు, కార్మికులకు విధుల నుంచి కొంతకాలం మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ఎన్ఎంయూ రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రెటరీ కామ్రేడ్ సత్యం బుధవారం సంస్థ ఎండీ సునీల్‌శర్మను కలిసి విన్నవించారు. అలాగే 9వేలమంది కార్మికులు పీఎఫ్ కోసం, సీసీఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నందున వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బోనాలు, పూజా సామగ్రికి అనుమతి లేదు : ఈఓ

అమీర్‌పేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కరోనా విజృంభిస్తోన్న నేపథ్యంలో ముందస్తు రక్షణ చర్యల్లో భాగంగా బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలోకి పూజా సామగ్రి, బోనాలు, ఒడిబియ్యం, కొబ్బరికాయలు తదితర వస్తువులకు అనుమతి లేదని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎం.వి.శర్మ తెలిపారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే చింతల జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకుడు వెల్దండ వెంకటేష్

బంజారాహిల్స్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఫిలింనగర్‌లో బీజేపీ నాయకుడు వెల్దండ వెంకటేష్ ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు శంకర్, ప్రధానకార్యదర్శి గడ్డం వెంకటస్వామి, నాయకులు నీరజ, శ్రీనివాసచారి, గోవింద్, ఆదినారాయణ పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు!

స్పోర్ట్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్)లో కొందరు ఉద్యోగులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని, ఇకపై క్రమశిక్షణ పాటించకపోతే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని శాట్స్ వీసీ, ఎండీ, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ రఘునందన్‌రావు హెచ్చరించినట్టు సమాచారం. శాట్స్ ఎండీగా బాధ్యతలు తీసుకున్నాక ఆయన కార్యాలయానికి రావడం ఇదే తొలిసారి. దాదాపు మూడు గంటలు పెండింగ్‌లో ఉన్న అన్ని ఫైళ్లను తెప్పించుకుని పరిశీలించిన ఎండీ.. సిబ్బంది బాధ్యతారాహిత్యాన్ని గమనించి తీవ్రంగా మందలించినట్టు తెలిసింది. ఈ మధ్య తనని కలిసి వినతిపత్రం ఇచ్చిన కాంట్రాక్టు కోచ్‌ల రెగ్యులరైజేషన్ అంశంతో పాటు స్పోర్ట్స్ స్కూళ్ల స్థితిగతులు, ఎల్బీ, గచ్చిబౌలి, సరూర్‌నగర్ స్టేడియాల పరిస్థితి, సంస్థ ఆదాయ వనరులు గురించి సంబంధిత సిబ్బందితో సుదీర్ఘంగా ఆయన చర్చించారు. ఇకనుంచి ఏ విషయంలో జాప్యం జరిగినా ఉపేక్షించేది లేదని.. క్లరికల్ స్టాఫ్ విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని.. పద్ధతి మార్చుకోకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎండీ చెప్పినట్టు తెలిసింది.

హిమాయత్‌సాగర్‌లో జలమండలి కార్యాలయం

నార్సింగ్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జలమండలి 17వ డివిజన్ కార్యాలయాన్ని గుడిమల్కాపూర్ భోజగుట్ట నుంచి హిమాయత్‌సాగర్‌కు మార్చారు. భోజగుట్టకు ఆనుకుని ఉన్న గండిపేట మండలంలోని పలు ప్రాంతాలకు ప్రస్తుతం జలమండలి నీరు సరఫరా చేస్తున్నందున డివిజన్ కార్యాలయాన్ని హిమాయత్‌సాగర్‌కు మార్చారు. దీనిని జలమండలి జీఎం హరిశంకర్ పూజలు చేసి బుధవారం ప్రారంభించారు.

మనూ విద్యార్థినికి డాక్టరేట్

హైదరాబాద్ సిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మనూ) మహ్మద్ ముంతాజిమ్‌కు డాక్టరేట్‌ను ప్రకటించింది. డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ ఇన్ ఎడ్యుకేషన్‌కు అర్హత సాధించడంతోపాటు 'అకాడమిక్ అచీవ్‌మెంట్ ఆఫ్ ఉర్దూ అండ్ ఇంగ్లిష్ మీడియం సెకెండరీ స్కూల్ స్టూడెంట్స్ ఇన్ రిలేషన్ టూ దేర్ ఎమోషనల్ ఇంటెలిజెన్సీ, స్టడీ హాబిట్స్ అండ్ అచీవ్‌మెంట్ మోటివేషన్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈమెకు సూపర్‌విజన్‌గా ప్రొఫెసర్ మహ్మద్ ముజాహిద్ వ్యవహరించారు.

13న సీటీడబ్ల్యూ టెక్నికల్ ఎంట్రీస్కీమ్ కోర్సు పాసింగ్ ఔట్ పరేడ్

అల్వాల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): టెక్నికల్ ఎంట్రీ స్కీమ్-35 కోర్సుకు సంబంధించిన పాసింగ్ ఔట్ పరేడ్‌ను ఈ నెల 13న బొల్లారంలోని కరియప్ప డ్రిల్ స్క్వేర్(సీటీడబ్ల్యూ)లో మొదటిసారిగా నిర్వహిస్తున్నారు. మిలిటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్(ఎంసీఈఎంఈ) 24మంది అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. ఈ పరేడ్ ఇండియన్ మిలిటరీ అకాడమీ డెహ్రాడూన్‌లో జరగాల్సి ఉంది. కొవిడ్-19 కారణంగా సీటీడబ్ల్యూలోనే నిర్వహిస్తున్నారు. ఈ పరేడ్‌కు ముఖ్య అతిథిగా ఎంసీఈఎంఈ కమాండెంట్ నారాయణన్ హాజరుకానున్నారు.

టైప్‌రైటింగ్ పరీక్షలు జూలై 4న

కుషాయిగూడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కొవిడ్-19 కారణంగా వాయిదాపడ్డ టైప్‌రైటింగ్ పరీక్షలు జూలై 4న నిర్వహించనున్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ప్రకటన విడుదల చేసింది. గత మార్చి నెల 22వ తేదీన జరగాల్సిన ఈ పరీక్షలు జనతా కర్ఫ్యూ, తదనంతరం లాక్‌డౌన్ వల్ల వాయిదా పడ్డాయి. లోయర్, హయ్యర్ గ్రేడ్‌ల వారీగా ఇంగ్లిష్, తెలుగు, హిందీ, ఉర్దూ భాషల్లో నిర్వహించే ఈ పరీక్షల 3, 4బ్యాచ్‌ల విద్యార్థుల ఎదురుచూపుల తర్వాత షెడ్యూల్ విడుదలతో ఫలించినట్లయింది. అదేవిధంగా షార్ట్‌హ్యాండ్ పరీక్షలు జూలై 11న నిర్వహించనున్నట్లు కార్యదర్శి యు.వి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు.

నేడు అంతర్జాతీయ లెవెల్ క్రాసింగ్ అవగాహన దినం

సికింద్రాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): లెవెల్ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు ప్రజలను చైతన్యవంతం చేసేందుకు నేడు అంతర్జాతీయ లెవెల్ క్రాసింగ్ అవగాహనా దినం జరుపుకోనున్నట్టు దక్షిణమధ్యరైల్వే ముఖ్య ప్రజాసంబంధాల అధికారి సీహెచ్.రాకేష్ తెలిపారు. కాగా, కాపలా ఉన్న లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని రైల్వే జనరల్ మేనేజర్ గజానన్ మాల్యా ఆదేశించారు.

లోతట్టు ప్రాంతాలపై ఎమ్మెల్యే సమీక్ష

మియాపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని లోతట్టు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలు, అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే గాంధీ బుధవారం జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ రవికిరణ్, వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని లోతట్టు ప్రాంతాల్లో సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

'అధికారులు సమన్వయంతో పనిచేయాలి'

కూకట్‌పల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో తలెత్తే సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. కూకట్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో వర్షాకాలం సమస్యలపై చర్చించేందుకు ఆయన బుధవారం కార్పొరేటర్లు, అధికారులతో సమావేశమయ్యారు. ముఖ్యంగా డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

బాలకృష్ణ సేవలు అభినందనీయం

- టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిబాబా

రాంనగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు ఆశయాలను కొనసాగిస్తున్న ప్రముఖ సినీనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సేవలు అభినందనీయమని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయిబాబా పేర్కొన్నారు. బుధవారం దోమలగూడలోని పార్టీ నగర కార్యాలయంలో నగర కమిటీ ఆధ్వర్యంలో బాలకృష్ణ 60వ జన్మదిన వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, బిల్దర్ ప్రవీణ్, రవీంద్రచారి, రాజాచౌదరి, ఎం.కె.బోస్ పాల్గొన్నారు.

'జర్నలిస్టు కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి'

మెహిదీపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కరోనాతో మృతిచెందిన జర్నలిస్టు కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని పశ్చిమ మండలం జర్నలిస్టులు, రాజకీయ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పశ్చిమ మండలం జర్నలిస్టుల ఆధ్వర్యంలో లంగర్‌హౌజ్‌లోని బాపూఘాట్‌లో గాంధీ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం, డాక్టర్ల నిర్లక్ష్యం తగదని వారు పేర్కొన్నారు.

'మీర్‌పేట్'లో ఆధిపత్య పోరు..!

పాలకవర్గంలో లుకలుకలు

సరూర్‌నగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట కార్పొరేషన్ పాలకవర్గంలో అధికార పార్టీ మధ్య ఆధిపత్య పోరుకు తెరలేచింది. ఇటీవల వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన కౌన్సిల్ సమావేశానికి 46మంది సభ్యులకు 23మంది మాత్రమే హాజరు కావడంపై మంత్రి సబితాఇంద్రారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. అందులోనూ నలుగురు ఫోన్‌లో అందుబాటులోకి వచ్చారు. దీంతో మంగళవారం సాయంత్రం పొద్దుపోయిన తర్వాత సుమారు మూడు గంటల పాటు మంత్రి ఆర్‌కేపురంలోని తన క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించగా, అధికార పార్టీ సభ్యులు పరస్పరం విమర్శలు చేసుకున్నట్లు తెలిసింది. సొంత పార్టీ సభ్యులను కూడా మేయర్, డిప్యూటీ మేయర్ పట్టించుకోవడంలేదని కొందరు సభ్యులు ఆరోపించినట్లు తెలిసింది. కమిషనర్ సైతం తమ వార్డులో జరిగే పనుల వివరాలు కూడా చెప్పడం లేదని కొందరు మంత్రి ఎదుట వాపోయినట్లు సమాచారం.

వసూల్ రాజా..

అధికార పార్టీకి చెందిన ఓ కార్పొరేటర్ వసూల్ రాజాగా మారి పార్టీకి చెడ్డపేరు తీసుకొస్తున్నాడని కొందరు మంత్రి ఎదుట బహిరంగ ఆరోపణ చేసినట్లు తెలిసింది. ఏ నిర్మాణం దగ్గరకు వెళ్లినా ఆయన పేరే వినిపిస్తోందని చెప్పినట్లు సమాచారం. దీంతో అక్రమనిర్మాణాలను సైతం తాము అడ్డుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేసినట్లు, మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్‌ల ధోరణి మారేలా చూడాలని మంత్రిని కోరినట్లు సమాచారం.

రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ నిపుణుల తయారీయే లక్ష్యం

చిక్కడపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్(ఆర్‌పీఏ) నిపుణుల తయారీయే లక్ష్యమని యూఐ పథ్ ఇండియా సార్క్ అధ్యక్షుడు మనీష్ భారతి అన్నారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) సంస్థతో కలిసి ఆటోమేషన్ నిపుణుల తయారీ కోసం శిక్షణ ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. బుధవారం నగరంలో టాస్క్, యూఐపై పథ్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. టాస్క్‌లో భాగస్వామ్యంగా ఉన్న 50కి పైగా విద్యాసంస్థలు, 100కు పైగా విద్యావంతులతో ఆర్‌పీఏ డిజైనర్ డెవలప్‌మెంట్ కోసం శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. టాస్క్‌తో భాగస్వామ్యం ద్వారా ఆర్‌పీఏని అందరికీ అందుబాటులోకి తెస్తామని తద్వారా విద్యార్థుల ఉపాధికి పునాది ఏర్పడుతుందని తెలిపారు. టాస్క్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీకాంత్ సిన్హా మాట్లాడుతూ ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో విద్యార్థుల భవిష్యత్ అవసరాలకు తగినవిధంగా యూఐ పథ్ సంస్థతో కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు.

తెలంగాణ పద్మశాలీ వెబ్‌సైట్ ప్రారంభం

మియాపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పద్మశాలీ వెబ్‌సైట్‌ను బుధవారం వెబ్‌సైట్ కన్వీనర్ పురుషోత్తం ఆ సంఘం నాయకులతో కలిసి మియాపూర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత, పవర్‌లూమ్‌కు గుర్తింపు తీసుకురావడంతోపాటు పద్మశాలీ నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ఈ వెబ్‌సైట్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా చేనేత అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు ఉదయ రాజశేఖర్, నాగభూషణం, జనార్దన్, జ్ఞానేశ్వర్, వెంకటోషబాబు, కృష్ణ, చంద్రశేఖర్, సత్యదేవ్ పాల్గొన్నారు.

'విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించండి'

భైరతాబాద్ జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు లాక్‌డౌన్ ఇబ్బందులు లేకుండా చేయాల్సింది పోయి 3నెలల విద్యుత్ బిల్లులను ఒకేసారి భారీగా వేస్తూ మరిన్ని ఇబ్బందులకు గురిచేయడం సరికాదని బీజేపీ నగర అధ్యక్షుడు రాంచందర్‌రావు, రాష్ట్ర నాయకుడు మోత్కుపల్లి నర్సింహులు పేర్కొన్నారు. బుధవారం ట్రాన్స్‌కో సీఎండీ రఘుమారెడ్డికి వారు వినతిపత్రం ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి Daily CLASSIFIEDS

GOLD FINANCE

★ మీ బంగారం బ